గ్రామజీవనంలో సమ్మత్తులు :

# సిగ్గుపడాల్సిన కొత్త మార్గం !



* కె. ఆర్. మూర్తి *

పున్నమ్మత్త అరుస్తున్నది 'మా ఇంట్లో ఎక్కడయ్యా ఖాళీ. అటు సత్రంలోకి పో' అని. శివయ్య కక్కాయ్ ఆమెను కోప్పడ్తున్నాడు 'ఇల్లంతా కట్టకెళ్తావా. నోరు మూసుకొని పడుండు' అని. ఆమాత్రానికి ఆగే మనిషి ఆమె ఎట్లాగూ కాదు. అరుపుల్లోనుంచి వెక్కిరింపుల్లోకి దిగింది. ఇదంతా మామూలే ఈ అప్పా తమ్ముళ్ళతో.

'పట్టపగలే దోస్తున్నారు; ఎన్నడూ లేదు ఈ ఊళ్లో. ఏ వేషం వేసుకొని ఎవడొస్తాడో, ఎవరు చూశారు' అన్నది. పున్నమ్మత్త పాటల శిష్యురాలు ఒకామె; నిజమే. ఈ మధ్య మా ఊళ్లో పగటి దొంగతనాలు జరుగుతూనే ఉన్నయ్. దానితో ఆమె మళ్లీ విజృంభించింది.

ఇంతలో నేను వెళ్ళాను. అసలు సంగతి ఏమిటో కనుక్కుందామని. వరంగల్ కాపురస్తుట్ట- లేచి వచ్చాట్ట-కాపరం అదీ గుంటూళ్లో వదిలి సంచారంచేస్తున్నాట్ట-ఈవూరొచ్చి రాత్రికి పడుకోటానికి ఎక్కడ చోటు దొరుకుతుందా అని విచారిస్తే 'ఫలాన శివయ్యగారింటికి వెళ్ళు పెద్ద యిల్లు విశ్రాంతిగా ఉంటుందని' చెప్పారుట— శివయ్య బాబాయి దారిలోనే ఎదురై సంగతంతా కనుక్కొని ఇంటికి తీసుకొచ్చాట్ట జాలిపడి. రోజూ పేపర్లో చూస్తున్నాడుగా నైజాంలో జరుగుతున్న కిరాతకృత్యాలు.

నేనంటె పున్నమ్మత్తకు గురి, ఆమెకు, ఆమె శిష్యబృందానికి హిందూమతం ఎంత ఆపద్దశలో ఉన్నదో ఒక ఉద్రేకపూరితమైన ఉపన్యాసం ఇచ్చి, ఆ కాందిశీకుడికి ఆశ్రయమే కాకుండ భోజనం ఏర్పాటు కూడ చేయించి వచ్చా.

మర్నాడు పొద్దున్నే పేపరు చదువుతుంటే ఆ వరంగల్ ఆయన మా ఇంటికి వచ్చి, 'నైజాం సంగతులు ఏమున్నయ్, బాబు' అని అడిగాడు. వార్తలు క్లుప్తంగా చెప్పి వరంగల్‌లో ఉండగా ఆయన ఏమి చేస్తుండేది, అవీ అడిగాను. తనకు వరంగల్‌లో మూడెకరాలు మాగాణిభూమి, ఐదెకరాల మెట్టభూమి, ఇల్లు, గొడ్డూ గోదం ఉంటే అవన్నీ వదలిపెట్టి ఇద్దరిపిల్లల్ని, భార్యను, ముసలి తండ్రిని తీసుకొని ఇటు పారిపోయి వచ్చాననీ ఇప్పుడు అక్కడ మాలలు, లంబాడీలు మాత్రమే ఉన్నారనీ, ఈ ప్రాంతం తనిదివరకెప్పుడూ చూడలేదనీ చెప్పాడు. ఆ పూట మా ఇంటికి భోజనానికి పిలిచా ఆయన్ని. యాచించుకోటానికని ఆయన ఊళ్లోకి వెళ్ళాడు.

ఎక్కడనుంచో ఊడిపడ్డాడు వేలువిడిచిన మేనమామ. బియ్యం అసలే దొరకటంలేదని లోపల ఏం గొణుక్కున్నా తప్పదుగా- పూటకూలి కొంపకూడా లేదాయె. చేటంత ముఖం చేసుకొని 'ఏం మామయ్యోవ్, ముసుర్లో వస్తున్నావే' అన్నా.

'ఇక్కడ బియ్యం కరువేం లేదుగా' అన్నాడు- ఇద్దరం గదిలో కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నాం 'భోజనాలకు లేవొచ్చు' అని పిలుపొచ్చింది. స్నానాలు అయి వంటింట్లోకి వెళ్ళేటప్పటికి ఆ వరంగల్ పెద్దమనిషిని చూసి 'ఎక్కడనుంచండోయ్' అన్నాడు మామయ్య.

మేమంతా తెల్లబోయి చూస్తున్నాం. ఆయన మటుకు తల పైకెత్తకుండా 'గుంటూరునుంచండీ' అన్నాడు. 'సిగ్గుపడకుండా భోజనం చేయండి' అంది అమ్మ ఆ అన్నాతురుడిని.

భోజనాలైంతరువాత సంగతంతా చెప్తే 'పోలూరుదగ్గర యద్దనపూడిరా ఈయనది. ఒకటి రెండు తడవలు నైజాం వెళ్ళినట్లున్నాడు ఆయన యాత్రల్లో' అన్నాడు మామయ్య.

'నాకూ అనుమానం వేసింది మామయ్యా. బాషగాని, మాట్లాడే తీరుగాని నైజాం తరహాగా లేదు' అన్నా లోలోపల సిగ్గుపడ్తూ.